క్లుప్తంగా

సత్యసాయి పల్లకీసేవ



వనపర్తి టౌన్: సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సత్యసాయిబాబా పల్లకీ సేవను పుర వీధుల గుండా ఊరేగించారు. ఈ మేరకు సాయి భక్తులు భక్తి గీతాలను ఆలపిస్తూ ముందుకుసాగారు. శనివారం వనపర్తిలో సాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, అభిషేకాలు, అర్చనలు, హోమం, అన్నదానం, వస్త్రదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

రైతుల సంబరాలు



కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపురం గ్రామంలో రైతులు సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇస్తానని చెప్పి.. ఇచ్చిన మాట ప్రకారం ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులతో పాటు బోనస్ డబ్బులను జమచేశారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంబురాలు నిర్వహించి స్వీట్లు పంచిపెట్టుకున్నారు.

వీరనారి జల్కారీబాయి

వనపర్తి టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన వీరనారి జల్కారీబాయి అని ప్రజావాగ్గేయకారుడు, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర కన్వీనర్ రాజారాంప్రకాశ్ కొనియాడారు. జల్కారీబాయి 195వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, గంధం నాగరాజు, వెంకటస్వామి, రమేష్‌చారి, మాధవచారి, నాగరాజుచారి, సత్యంచారి పాల్గొన్నారు.

కంకర టిప్పర్ పట్టివేత



గోపాల్‌పేట: రేవల్లి మండలంలో అనుమతులు లేకుండా కంకర తరలిస్తున్న టిప్పర్‌ను మైనింగ్ అధికారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండలంలో శుక్రవారం పీపీఆర్ క్రషర్ నుంచి అనుమతులు లేకుండా టిప్పర్‌లో సన్న కంకర తరలిస్తుండగా.. మైనింగ్ ఆర్‌ఐ జ్యోతిలక్ష్మి పట్టుకుని తమకు సమాచారం ఇచ్చారని ఎస్‌ఐ పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు లోడుతో ఉన్న టిప్పర్‌ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాము చెప్పారు.

విజయభాస్కర్‌రెడ్డికి సత్కారం



ఆత్మకూర్: తెలంగాణ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఆత్మకూర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది విజయభాస్కర్‌రెడ్డి నియమితులైన సందర్భంగా శుక్రవారం పలువురు పూలమాల, శాలువాతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ తరుపున హైకోర్టులో కేసులు వాదించడానికి ఆత్మకూర్‌కు చెందిన న్యాయవాది విజయభాస్కర్‌రెడ్డి నియామకం ఆత్మకూర్‌కే గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఖానాపురం తిరుపతయ్య, నామాల కృష్ణయ్య, రాములు, రాజ్‌కిరణ్, రవిచారి, విజయ్, యూసూఫ్ తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఖాళీలను భర్తీ చేయాలి

వనపర్తి రూరల్: జిల్లాలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో జిల్లాలోని మైనార్టీ అల్ప సంఖ్యాక నిరుద్యోగ యువకులతో భర్తీ చేయాలని అవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2007లో బాబు రాజేంద్రప్రసాద్ సచార్ కమిటీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో నివేదికలో ఎస్సీ, ఎస్టీల కంటే 33 శాతం మైనార్టీ ముస్లింలు వెనుకబడి ఉన్నారని తెలిపారు.

ప్రైవేట్ వ్యాపారులే దిక్కు!

- దుప్పల్లిలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయని అధికారులు
- 2 వేల ఫైచిలుకు ఎకరాల్లో వరి సాగు
- ఆందోళనలో అన్నదాతలు



దుప్పల్లిలో రైతులు ఆరబోసిన వరి ధాన్యం

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకే విక్రయిస్తున్నారు. శ్రీ కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద ఇక్కడ 2 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ సీజన్‌లో పండించిన పంటను విక్రయించేందుకు ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి దళాలను ఆశ్రయించాల్సి వస్తుంది. గతంలో ఇక్కడ వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని తరలించేవారు.

తక్కువ ధరకే..

కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అయినా ధాన్యం కొనాలని వేడుకుంటున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు తేమశాతం లేదని, నాణ్యత లేవని కారణాలు చూపుతూ అందిన కాడికి దోచుకోవాలని చూస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. ఐకేపీ లేదా సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 అదనంగా బోనస్ ఇస్తుండంతో ఈ గ్రామ రైతులు ఆ డబ్బులను నష్టపోతున్నారు.

ఆరు ఎకరాల్లో వరి సాగు



నేను ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. వరి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నాను. గ్రామ రైతులందరూ అదే విధంగా అమ్ముకుంటున్నారు. గత ఆరు రోజులుగా తేమ లేదంటే ఇక్కడ ఆరబోశాను. ప్రధానంగా ప్రభుత్వం ఇస్తున్న బోనస్ నష్టపోతున్నాము.

– విష్ణువర్ధన్‌రెడ్డి, దుప్పల్లి

సమన్వయ లోపంతో..

మండలంలో ఇప్పటి వరకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ఏడు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించాం. దుప్పల్లిలో సైతం కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించాం. కానీ స్థానికంగా ఉండే సంఘం సభ్యులు దీనికి ముందుకు రావడం లేదు. వారిలో సమన్వయ లోపం కారణంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. మరోసారి వారితో చర్చించి, తదుపరి చర్యలు తీసుకుంటాం.

– కృష్ణవేణి, ఏపీఎం, మదనాపురం

త్వరలో ఏర్పాటు..

దుప్పల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదనే విషయం తమ దృష్టికి వచ్చింది. రైతుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటాం. దీనిపై ఐకేపీ సిబ్బందితో మాట్లాడి.. త్వరలోనే కొనుగోలు కేంద్రం ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

– అబ్రహంలింకన్, తహసీల్దార్

‘మాలల సింహగర్జనకు సిద్ధం కావాలి’



సమావేశంలో పాల్గొన్న మాల ప్రతినిధులు

వనపర్తి టౌన్: మాల జాతిబిడ్డ అంబేడ్కర్ స్ఫూర్తితో డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మాలల సింహగర్జనకు జిల్లాలోని మాలలంతా కదలి రావాలని జైభీం సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణ అన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాలలపై విషం కక్కుతున్న వారికి తగిన గుణపాఠం చెప్పేలా ప్రతి ఇంటి నుంచి మాలల కదలిరావాలని పిలుపునిచ్చారు. జాతి ఐక్యతకు మాలల సింహగర్జన ప్రతిబింబంగా నిలవాలని కోరారు. సొంత ఖర్చులతో ప్రతి కుటుంబం కదలకపోతే మాల ఐక్యతను దెబ్బతీసేలా విష ప్రచారం చేస్తారని, ప్రతి మాల బిడ్డ ఇంటిపనిగా భావించి అడుగు వేయకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, ప్రతినిధులు చంద్రశేఖర్, నిరంజన్, బందారు శ్రీనివాసులు, వెంకటస్వామి, ఆంజనేయులు, ఆనంద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుగుణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని ఆమె పేర్కొన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల పూర్తి చేసుకునే యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏదైనా మార్పులు, చేర్పులు ఉంటే బీఎల్‌ఓల దృష్టికి తీసుకు రావాలన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

ఖిల్లాఘనపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు. ఇటీవల మండలంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. వారిని శుక్రవారం వనపర్తి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వారిలో ఇద్దరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధించగా.. మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి చట్టపరంగా చర్యలు ఉంటాయని ఆయన చెప్పారు.

ఆత్మకూర్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఇద్దరిని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జరిమానాలు విధించారని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. అమరచింత మండలం సింగంపేటకు చెందిన చిన్నపాగ రవి, చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన వెంకటన్న, ఆత్మకూర్ మండలం పిన్నంచర్లకు చెందిన వెంకటన్న కు రూ.1000 చొప్పున జరిమానా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఆత్మకూర్‌కు చెందిన దాసు, పవన్‌కళ్యాణ్ కు రూ.200 చొప్పున జరిమానా విధించారని తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న బాలరాజ్

అమరచింత: మహిళా పొదుపు సంఘాల్లో సభ్యురాలిగా ఉంటూ బ్యాంకులో వ్యక్తిగత సిబిల్ స్కోరు అధికంగా ఉన్న వారికి మహిళా శక్తి ద్వారా వ్యక్తిగత రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మెప్మా జిల్లా కోఆర్డినేటర్ బాలరాజ్ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్పీలు, పట్టణ మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సమాఖ్యలోని సభ్యులందరూ ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొంది, తమ కుటుంబాల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలన్నారు. అమరచింత మున్సిపల్‌లో మహిళా సంఘాలను ఇప్పటి వరకు రూ.1.08కోట్ల రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగుల రిలే దీక్షలు

వనపర్తి టౌన్: దివ్యాంగులకు రూ. 6వేల పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు రిలే దీక్షలకు దిగనున్నట్లు వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రిలే దీక్షలతో పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ. 6 వేల ఫించన్ ఇస్తామని, నేటికీ అమలు చేయకపోవడంతో పోరాటానికి దిగుతున్నట్లు వెల్లడించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మేడేపల్లిలో సీఐ, ఎస్‌ఐలకు నగదు అందజేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్: సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. శుక్రవారం మండలంలోని మేడేపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలని, విరాళాలు సేకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూ.25వేలు సమకూర్చి సీఐ, ఎస్‌ఐ కి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఏఎస్‌ఐ బీచుపల్లి, సిబ్బంది బాల్‌రాజు, సత్యనారాయణ, ఇమామ్, గ్రామస్తులు అంజనేయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి శుక్రవారం ముగ్గురు బాధితులకి అప్పగించినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన శంకర్, మండలంలోని జూరాలకు చెందిన లక్ష్మి, మాగనూర్ మండలంలోని నేరేడుగాం కు చెందిన తిమ్మప్ప ఈనెల 20వ తేదీన ఆత్మకూర్ నుంచి ఆర్టీసీ బస్సులో కురుమూర్తి జాతరకు వెళ్తుండగా ఫోన్లు చోరీకి గురయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్‌ద్వార మహబూబ్‌నగర్‌లో సెల్‌ఫోన్ల ఆచూకీని గుర్తించి రికవరీ చేసి అప్పగించినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

అమరచింత: సైబర్ నేరగాళ్లతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వీటి గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో లాభంతో పాటు నష్టం కూడా అదే స్థాయిలో ఉందన్నారు. పిల్లలు ఇంట్లోని తల్లిదండ్రుల సెల్‌ఫోన్ తీసుకుని ఆన్‌లైన్ గేమ్‌లు ఆడొద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్‌కు స్పందించి వ్యక్తిగత బ్యాంక్ వివరాలు, ఓటీపీలు చెప్పరాదన్నారు. అమ్మాయిలకు ఎవరినుండైనా వేధింపులు ఎదురయితే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర సమయంలో అమరచింత పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు.

గోపాల్‌పేట: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు చెప్పరాదని ఎస్‌ఐ నరేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఉండే పెద్ద వాళ్ల ఫోన్లు వాడేటప్పుడు తెలియని యాప్స్ ఇన్‌స్టాల్, మెయిల్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు.



గోపాల్‌పేటలో..



పాంరెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం క్రమ తప్పకుండా తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగళాయిపల్లిలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాలనీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో నిల్వ నీటిని వారానికి రెండు సార్లు పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు వృద్ధి చెంది రోగాలు సంభవిస్తాయన్నారు. బాలింతలు, గర్భిణులు ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో వ్యాధుల నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమనశ్రీ, రమాదేవి, శైలజ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వంట గదులను, సరుకులను పరిశీలించి వంట ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు రుచికరమైన భోజనం అందించాలని, వంట సరుకులు నిల్వ చేసే గదిని, వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రిజిస్టరులో ప్రతి రోజు చేసే వంటల వివరాలను నమోదు చేయాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో భోజనం నాణ్యతగా అందించడం లేదనే విషయంపై వంట ఏజెన్సీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి సహకరించిన వారిపై కేసు నమోదు

పాన్‌గల్: బాల్య వివాహానికి సహకరించిన వారిపై కేసు నమోదైన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె(17)ను వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన అబ్బాయితో బాల్య వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిపై గత నెల 27న 1098కు సమాచారం రావడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసీయాబేగం, చైల్డ్ వెల్ఫేర్ కౌన్సిలర్ రాజేష్, ఐసీపీఎస్ వర్కర్ జీవిత, పోలీసులు కలిసి అమ్మాయి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, అమ్మాయికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. కానీ శుక్రవారం బాల్య వివాహం చేశారని, అందుకు సంబంధించిన పెళ్లి ఫొటోలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు పంపి సమాచారం ఇచ్చారన్నారు. బాల్య వివాహం చేయడం చట్టారీత్యా నేరమని చెబుతూ కౌన్సిలింగ్ ఇచ్చిన కూడా వినకుండా బాల్య వివాహం చేసిన అమ్మాయి, అబ్బాయి, ఇద్దరి తండ్రులపై బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసీయా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులను న్యాస్ పరీక్షలకు సిద్ధం చేయాలి



పాన్‌గల్ పీఎస్‌లో ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: డిసెంబర్ 4న నిర్వహించే న్యాస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం అన్నారం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించి మధ్యాహ్న భోజనం, న్యాస్ పరీక్ష పేపర్లు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట పాత్రలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. భోజనానికి ఉపయోగించి కూరగాయాలు తాజావి కొనుగోలు చేయాలని, వంట ఏజెన్సీ కార్మికులు పరిశుభ్రత పాటించాలని, మధ్యాహ్న భోజనం రిజిస్టరు తప్పక నిర్వహించాలని, ప్రతి రోజు భోజనాన్ని హెచ్‌ఎంలు తనిఖీలు చేయాలన్నారు. అంతకుముందు ఆయన పీఎస్ పాన్‌గల్‌లో ప్రార్థన సమయంలో పాల్గొన్నారు.


కులవృత్తుల ప్రత్యేక ఫెడరేషన్ల ఏర్పాటుకు వినతి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దాసర్ల భూమయ్య

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో వెనుకబడిన జాతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి, నిధులు మంజూరు చేయాలని, రాజకీయంగా అవకాశాలు కల్పించాలని వనపర్తి జిల్లా వడ్డెర, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు దాసర్ల భూమయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ దేవరకొండ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో వెనకబడిన తరగతులు, కులవృత్తుల వారికి రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై డెడికేటెడ్ నిర్వహించారు. కమీషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసిన వారు వారి కులవృత్తుల సమస్యలపై వేరు వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు బీసీ లకు, సంచార జాతుల వారికి అందాల్సిన రిజర్వేషన్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. వడ్డెరులకు గుట్టలపై పూర్తి హక్కును కల్పించాలని తెలిపారు. గుట్టలపై కుల వృత్తి నిర్వహణ కోసం సబ్సిడీపై జేసీబీలు, హిటాచీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, కంప్రెషర్లను అందించాలని కోరారు. రజక సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బతుకుదెరువు కోసం రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసుకుంటున్న డబ్బాలను తొలిగించకుండా చూడాలన్నారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమం



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

వనపర్తి రూరల్: పేద, మధ్యతరగతి వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాలంటే అది బీజేపీతోనే సాధ్యమని రాష్ట్ర సంర్పచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. జిల్లా పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు సందా వెంకటేష్, ఆర్‌ఓ తిరుమలయ్యయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి మండలంలోని మెంటెపల్లి, కడుకుంట్ల గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా మంద సోమన్న, సభ్యులుగా నరేష్‌యాదవ్, చింతకాయల ఆంజనేయులు, మర్దగళ్ల తిరుమలేష్, బొడ్డుపల్లి తిరుపతయ్య, మర్దగాళ్ల రాములు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ కమిటీ ప్రాధాన్యత, దాని అవసరం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ క్రియాశీల పాత్రను పోషిస్తుందని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్వైజరీ కమిటీని నియమించాలి

వనపర్తి రూరల్: వెల్ఫేర్ బోర్డు కార్మికులకు నిరంతరం ఆన్‌లైన్ సేవలు కొనసాగించాలని బిల్డింగ్ అండ్ నిర్మాణ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భవణ నిర్మాణ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంధం మదన్ అధ్యక్షతన బిల్డింగ్ అండ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్‌కు కార్మిక సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ, వెల్ఫేర్ బోర్డు నుంచి అక్రమంగా దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డులో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీటి షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏళ్లు దాటిన కార్మికుడికి రూ.5 వేల పింఛన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుమన్న, వెంకటయ్య, శ్రీను, నరేందర్, భాస్కర్, బాలరాజు, పుల్లయ్య, బాబు, రవిరాజు పాల్గొన్నారు.

98 శాతం సమగ్ర సర్వే పూర్తి

పాన్‌గల్: మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఇప్పటికీ 98 శాతం పూర్తైనట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని 28 జీపీల్లో 380 ఇళ్ల నుంచి ఎన్యుమరేటర్లు వివరాలను సేకరించారని, ఇప్పటి వరకు మండలంలో మొత్తం 12 వేలకు పైగా ఇళ్లు ఉండగా.. 11,784 ఇళ్ల నుంచి వివరాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు.